క్లుప్తంగా

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం, నిజ శ్రావణ మాసం, జ్యేష్ఠ నక్షత్రం, నవమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చీరాల: పట్టణంలోని కామాక్షి కేర్ హాస్పిటల్‌లో రోటరీ క్లబ్ క్షీరపురి సహకారంతో శనివారం ఉచిత షుగర్, మోకాలు నొప్పుల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ తాడివలస దేవరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక షుగర్‌తో బాధపడే వారికి, షుగర్ వలన తగ్గని గాయాలకు, షుగర్ వ్యాధి ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో ఎండీ జనరల్ మెడిసిన్ డాక్టర్ వీ మిథున్‌కుమార్ చౌదరి, ఎముకలు, మోకాళ్ల మార్పిడి స్పెషలిస్ట్ డాక్టర్ పి.చైతన్య చౌదరిలచే వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు. మోకాళ్ల నొప్పులతో బాధపడే వారికి అత్యాధునిక పీఆర్పీ వైద్యం అందించనున్నట్లు తెలిపారు. రోటరీ క్లబ్ క్షీరపురి వారి సహకారంతో రూ.350 చికిత్స అందించనున్నామన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు దరఖాస్తులు

బల్లికురవ: మండలంలోని పాఠశాలలో 8 వరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి–2 కె. రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల వారీగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని విద్యాశాఖాధికారి కార్యాలయంలో సెప్టెంబర్ 16వ తేదీ లోపు అందజేస్తే డిసెంబర్ 3న జరిగే పరీక్షకు హాజరు కావచ్చని చెప్పారు. పాఠశాలల వారీగా విద్యార్థుల చేత ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేయించాలని ఎంఈవో కోరారు.

తెలుగు భాష తియ్యనైనది, కమ్మనైనది..


తెలుగు భాష వారోత్సవాల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమణమ్మ

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో గురువారం తెలుగు భాష వారోత్సవాలను ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ ఎస్.జయశ్రీ అధ్యక్షత వహించారు. తెలుగు భాష విశిష్టత గురించి, ఆధునిక కవుల్లో ఒకరైన గిడుగు రామమూర్తి పంతులు గురించి విద్యార్థినులకు వివరించారు. అనంతరం తెలుగు విభాగం ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డి.జాన్‌రాజ్, జి.రత్న, ఐ.సుగుణకుమారి, టి.వెంకట గోపి, విద్యార్థినులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ద్రాక్షలోడు లారీ


గాయపడిన లారీ డ్రైవర్

మేదరమెట్ల: డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ద్రాక్ష పండ్ల లోడు లారీ బోల్తా కొట్టింది. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల ఉత్తర బైపాస్ సమీపంలో గురువారం తెల్లవారిజామున చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి ఏలూరుకు ద్రాక్షపండ్ల లోడుతో వెళ్తున్న లారీ మేదరమెట్ల జాతీయ రహదారి ఉత్తర బైపాస్ సమీపానికి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఫెన్సింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తలకు తీవ్ర గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పీహెచ్‌సీకి సీలింగ్ ఫ్యాన్ వితరణ


ఫ్యాన్‌ను అందజేస్తున్న దాత శ్రీనివాసరావు

చినగంజాం: మండల కేంద్రమైన చినగంజాంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనకు దాత సందు శ్రీనివాసరావు తన తండ్రి సందు వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం సీలింగ్ ఫ్యాన్ బహూకరించాడు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు ఎస్ విజయ భాస్కర్, పీ సాయి శ్రీచరణ్‌లకు స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో దాత శ్రీనివాసరావుతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వరాల తల్లీ.. వరలక్ష్మీ

- స్త్రీల వ్రతాలకు పెట్టింది పేరు
- వరలక్ష్మీ, మంగళ గౌరీ వ్రతాలకు ప్రసిద్ధి
- మెండుగా వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు


శ్రావణమాస లక్ష్మి అమ్మవారు

అద్దంకి: శ్రావణ మాసంలో ప్రతి ఇల్లు దేవాలయాన్ని తలపిస్తుంది.. నెల రోజుల పాటు ఉదయం, సాయంత్రం భగవన్నామస్మరణతో మారుమోగుతాయి. ఈ మాసంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా ఎంతో పవిత్రత ఉంటుంది. సాధారణంగా చేస్తే పూజల కన్నా కొన్ని రెట్లు అధిక ఫలం లభిస్తుందని పురాణాలు చెప్తున్నాయి. వరాలిచ్చే వ్రతాన్ని ఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. భక్తి, ఏకాగ్రత ఉంటే చాలు. వ్రతాన్ని చేయడం వల్ల లక్ష్మీదేవి కృపాకటాక్షాలు కలిగి ఐశ్వర్యం సిద్ధిస్తాయి. సకల శుభాలుకలుగుతాయి. స్త్రీలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు వ్రతం ఆచరించడం తప్పనిసరి. శ్రావణ మాసం తెలుగు సంవత్సరంలో ఐదో నెల. పంచాంగ శాస్త్ర ప్రకారం చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వలన ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. ఈ నెల వర్ష రుతువులో వస్తుంది. వర్షాలు బాగా పడుతుంటాయి.

స్త్రీలకు విశిష్ట మాసం..

త్రిమూర్తుల్లో స్థితికారకుడు దుష్ట శిక్షకుడు శిష్ట రక్షకుడు అయిన మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణం. అటువంటి మహావిష్ణువు పేరుతో ఏర్పడిన శ్రావణ మాసం. ఆయన ధర్మపత్ని మహాలక్ష్మికి అత్యంత ప్రీతిపాత్రమైనదిగా చెప్పబడింది. ఈమాసంలో చేసే దైవ కార్యాలకు ఎంతో శక్తి ఉంటుందని చెప్తారు. అందుకే ఈ మాసంలో స్త్రీలు శుక్రవారం నాడు, మంగళవారం నాడు వ్రతాలు, పూజలు ఆచరించడం వలన విశేష ఫలితాలు కలిగే మాసంగా పెద్దలు చెబుతారు.

అన్నీ పండుగలే..

శ్రావణ మాసం వివాహాది శుభకార్యాలకు చాలా విశిష్టమైన మాసం. ఈమాసంలో అన్నీ పర్వదినాలే. ఇందులో విశిష్టంగా శ్రావణ శుద్ధ పౌర్ణమి, శ్రావణ శుద్ధ విదియ, అన్నవరం సత్యనారాయణ స్వామి వారి జయంతి, శ్రావణ శుద్ధ తదియ, శ్రావణ శుద్ధ చతుర్థి ఇదే నాగుల చవితి, శ్రావణ శుద్ధ పంచమి గరుడ పంచమి, కల్కి జయంతి, శ్రావణ శుద్ధ షష్ఠి, శ్రావణ శుద్ధ సప్తమి, శ్రావణ శుద్ధ అష్టమి, శ్రావణ శుద్ధ నవమి, శ్రావణ శుద్ధ దశమి, శ్రావణ శుద్ధ ఏకాదశి సర్వేషాం ఏకాదశి, శ్రావణ శుద్ధ ద్వాదశి వరలక్ష్మి వ్రతం, దమోదర ద్వాదశి, శ్రావణ శుద్ధ చతుర్దశి వరాహ జయంతి, స్నేహితుల దినోత్సవం, శ్రావణ పూర్ణిమ (రాఖీ పూర్ణిమ) హయగ్రీవ జయంతి, శ్రావణ బహుళ పాడ్యమి, విదియ, తదియ, చవితి సంకట హర చతుర్థి, పంచమి, షష్ఠి, సప్తమి, అష్టమి కృష్ణాష్టమి, నవమి, దశమి, ఏకాదశి మతత్రయ ఏదకాశి, ద్వాదశి, త్రయోదశి చతుర్దశి మాస శివరాత్రి, అమావాస్య దీన్నే పొలాల అమావాస్యగా పిలుస్తారు.

మంగళ గౌరీ వ్రతం..

శ్రావణ మాసంలోని అన్ని మంగళవారాల్లో మంగళ గౌరీ వ్రతాన్ని స్త్రీలు ఆచరిస్తారు. దీన్నే శ్రావణ మంగళవార వ్రతం అని, మంగళ గౌరీనోము అంటారు. ఈ వ్రతాన్ని గురించి నారదుడు స్వయంగా సావిత్రికి, శ్రీకృష్ణుడు ద్రౌపదికి, తెలియజేసినట్లు పురాణాలు చెప్తున్నాయి. ఈవ్రతాన్ని కొత్తగా పెళ్లైన వారు ఆచరిస్తారు. వివాహమైన తరువాత వచ్చే శ్రావణ మాసంలో అన్ని మంగళ వారాల్లో ఈ వ్రతాన్ని ఆచరించి ఉద్వాసన చేయాలి. దీంతో వారికి నిండు సుమంగళిగా ఉండడమే కాకుండా వారి కుటుంబంలో సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని చెబుతారు.

వరలక్ష్మీ వ్రతం..

శ్రావణ మాసంలో పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారాన్నే వరలక్ష్మి వ్రతం. అదే విధంగా ఈ మాసంలో ప్రతి శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించవచ్చు. పూజ మండపంలో నిండు కలశాన్ని ఏర్పాటు చేసుకుని దానికి వరలక్ష్మీ దేవి ముఖప్రతిమను అలంకరించి పూజ చేయాలి. ఈవ్రతాన్ని ఆచరించడం వలన స్త్రీలకు సౌభాగ్యం, మాంగల్య బలాన్ని ఇస్తుందని నమ్మకం. ఇలాంటి మాసంలో హిందూ స్త్రీలు వరలక్ష్మీ వ్రతాన్ని, మంగళ గౌరీ వ్రతాన్ని పుణ్య దినాల సమయంలో పూజలు ఆచరిస్తుంటారు.

ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయం


పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


కేక్ కట్‌చేసి ఆనందం వ్యక్తం చేస్తున్న చీరాల బార్ అసోసియేషన్

- విద్యార్థుల ర్యాలీలు, ప్రదర్శనలు
- సంతోషం పంచుకున్న న్యాయవాదులు, ప్రజలు

చీరాల/చీరాల రూరల్: చంద్రయాన్–3 విజయవంతం అవడంలో ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఇస్రో ఆధ్వర్యంలో ప్రయోగించిన మిషన్ చంద్రయాన్–3 విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు జాతీయ జెండాలు చేతపట్టి భారత మాతాకీ జై.. అంటూ నినాదాలు చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఘనత సాధించిన శాస్త్రవేత్తలకు వారు అభినందనలు తెలిపారు. తదనంతరం న్యాయవాదులు కేక్ కట్‌చేసి ఒకరినొకరు తినిపించుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు, కటకం చంద్రశేఖర్‌లు మాట్లాడారు. చంద్రయాన్–3 విజయంతో అమెరికా, రష్యా, చైనాలతో అన్ని రంగాల్లో సమానంగా ఉన్నామని తేల్చి చెప్పినట్లయిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

☛ పట్టణంలోని రాఘవేంద్ర స్కూల్ ఆధ్వర్యంలో పట్టణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మణికుమార్ ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. చిరస్మరణీయ విజయాన్ని ఒక పండుగగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించామన్నారు. గడియార స్తంభం సెంటర్‌లో కేక్ కట్ చేశారు. అలానే విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.

అద్దంకిలో..

అద్దంకి రూరల్: ఇస్రో శాస్త్రవేత్తల బృందం కృషి అభినందనీయమని రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ అన్నారు. స్థానిక రోటరీ కార్యాలయంలో చంద్రయాన్–3 విజయవంతం అయిన సందర్భంగా వేడుకలు నిర్వహించి స్వీట్లు పంచిపెట్టారు. సందర్భంగా పలువురు మాట్లాడుతూ చంద్రయాన్–3 వల్ల దేశ ప్రతిష్ట మరింత ఇనుమడించిందన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరీ, గాడేపల్లి దివాకరదత్తు, దేవపాలన, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, డీవీఎం సత్యనారాయణ, ఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ 3 విజయవంతంపై ర్యాలీ..

ఇంకొల్లు (చినగంజాం): ఇస్రో శాస్త్ర వేత్తల చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతంపై ఇంకొల్లు నివేదిత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన సభలో పాఠశాల చైర్మన్ గోరంట్ల సుబ్బారావు భారత శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. అకడమిక్ డైరక్టర్ ఏరువ సుబ్బరామిరెడ్డి, ప్రిన్సిపాల్ పోతినేని సుధాకర్‌లు చంద్రయాన్ 3 ఉపయోగాలను విద్యార్థులకు తెలియజేశారు.

పర్చూరు (చినగంజాం): పర్చూరు స్థానిక బొమ్మల సెంటర్‌లో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై మేరా భారత్ మహాన్ అంటూ నినాదాలు చేశారు. ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు.


అద్దంకిలో మాట్లాడుతున్న రోటరీక్లబ్ సభ్యులు


ఇంకొల్లులో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


చీరాల: పట్టణంలో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఈ–క్రాప్‌తో రైతులకు ఎంతో మేలు


స్వర్ణలో ఈ–క్రాప్ ప్రారంభించిన ఆర్‌బీకేల సిబ్బంది

స్వర్ణ (కారంచేడు): రైతులు తప్పకుండా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని.. దీని ద్వారా అన్నదాతలకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయాధికారి సుధీర్‌బాబు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామంలో జరుగుతున్న ఈ–క్రాప్ బుకింగ్‌లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు అందించే అనేక రకముల రాయితీలతో పాటు, పంట నష్టపరిహారం, విత్తనాలు, ఎరువులు, రాయితీలపై యంత్ర పరికరాలు వంటివి సులభంగా పొందే వీలుంటుందన్నారు. ప్రస్తుతం సోయాబీన్, వరి సాగులు ప్రారంభమవుతున్నాయన్నారు. స్వర్ణ గ్రామంలో సుమారు 6875 ఎకరాల్లో ఈ–క్రాప్ బుకింగ్‌కు సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వీఏఏలు దుర్గాప్రసాద్, శారద, వీఆర్‌ఓ, సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

కంటివెలుగుతో అంధత్వం నుంచి ముక్తి


శస్త్ర చికిత్సకు వెళ్తున్న రోగులు

బల్లికురవ: ప్రభుత్వం అవ్వాతాతల ఆరోగ్య సమస్యలకు ప్రవేశపెట్టిన కంటి వెలుగుతో అంధత్వం నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ తెలిపారు. సోమవారం బల్లికువలో జరిగిన ఉచిత కంటివైద్య శిబిరంలో 76 మందిని శుక్లాల ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరందరికి గురువారం బల్లికురవ సబ్ సెంటర్లో వైద్య పరీక్షలు చేశారు. అనంతరం బస్సు ఏర్పాటు చేసి గుంటూరు సమీపంలోని పెదకాకాని శంకర్ వైద్యశాలకు ఆపరేషన్‌కు తీసుకెళ్లారు. ఆపరేషన్ తదుపరి శుక్రవారం సాయంత్రం తిరిగి ఇక్కడ తీసుకువస్తామని శంకర్ వైద్యశాల వైద్యాధికారి యల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై యూటీఎఫ్ పోరాటం


సభ్యత్వ నమోదు కార్డును అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కారంచేడు: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ రాష్ట్ర శాఖ నిరంతర పోటారం చేస్తూనే ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రావి పద్మావతి అన్నారు. గురువారం ఆమె మండలంలోని సర్ణ గ్రామంలో జరుగుతున్న యూటీఎఫ్ మండల శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల హక్కులు, వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమంపై ప్రభుత్వ పెద్దలతో సానుకూలంగా మాట్లాడం అవసరమైన చోట పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు భవనం శ్రీనివాసరెడ్డి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ రమేష్‌రెడ్డి, పావులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న యశ్వంత్

చినగంజాం: స్థానిక వాల్మీకి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దాతలు గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలోని సుమారు 30 మందికి పైగా ఉన్న వృద్ధులకు వారు అన్నదానం నిర్వహించారు. దాత చెరుకూరి యశ్వంత్ జన్మదినం సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భారత్ నిర్మాణ్ వలంటీర్ గోవిందస్వామి, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.


పథకాల లబ్ధి కార్డును అందజేస్తున్న శాప్‌నెట్ కృష్ణచైతన్య

వైఎస్సార్ సీపీ ప్రజల ప్రభుత్వం

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

సంతమాగులూరు(అద్దంకి): వైఎస్సార్ సీపీ ప్రజల ప్రభుత్వమని.. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, ఆ పార్టీ అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆయన మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులతో కలసి నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన ప్రతి గడపకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి, వారికి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని తెలిపే పత్రాలను అందజేశారు. ప్రభుత్వం ఎలా ఉంది.. పథకాలు బాగా అందుతాయన్నాయా, వలంటీర్ల సేవలు ఎలా అందిస్తున్నారని అడిగి, వారు చెప్పిన సమాధానాలతో సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ప్రజలంతా చెప్పుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. ఎవరో కొందరు పనిగట్టుకుని కావాలని ప్రభుత్వాన్ని విమర్శించడమే కాని, ప్రభుత్వ తీరు బాగుందని వారూ చాటున చెప్పుకుంటుంటారన్నారు. ఏది ఏమైనా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమని చెప్పారు. ఇతర రాష్ట్రాలు మన ప్రభుత్వ పథకాలను ఆయా రాష్ట్రాల్లో ప్రవేశ పెట్టేందుకు అధ్యాయనాలు చేసిన విషయన్ని గుర్తు చేశారు. మళ్లీ మళ్లీ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్ర అన్ని విధాల ఆర్థికాభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, మండల నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటర్లు సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నకిలీ ఓట్లపై బహిరంగ చర్చకు సిద్ధం


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పర్చూరు (చినగంజాం): నియోజకవర్గంలో ఉన్న నకిలీ ఓట్లపై బహిరంగ చర్చకు సిద్ధమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. గురువారం పర్చూరులో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ కాలేషావలి మాట్లాడుతూ ఆమంచిని విమర్శించే స్థాయి ఎవరికీ లేదన్నారు. నకిలీ ఓట్లు తొలగించమంటే టీడీపీ ఎందుకింత అక్కసు అని వారు ప్రశ్నించారు. 2014 నుంచి 2019 వరకు నీరు చెట్టు కార్యక్రమంలో వందల కోట్ల రూపాయిలు అవినీతి జరిగిందని దేవరపల్లి ఉప సర్పంచ్ తోకల కృష్ణమోహన్ ఆరోపించారు. టీడీపీ హయాంలో తమను ఫ్లెక్సీలు కట్టుకునేందుకు కూడా అవకాశం కల్పించలేదన్నారు. అక్రమంగా ఓటర్ల జాబితాలో చేర్పించిన బోగస్ ఓట్లను మాత్రమే తొలగించమని తాము డిమాండ్ చేస్తున్నామని మాజీ ఎంపీపీ కోట హరిప్రసాద్ తెలిపారు. ఏదైనా న్యాయబద్ధంగా జరగాలనే తాము కోరుకుంటుమన్నారు. అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేయవద్దని హితవు పలికారు. విదేశాల్లో ఉన్న వారి ఓట్లు, వివాహాలు అయి వెళ్లిపోయిన మహిళల ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించే వరకు పోరాడుతూనే ఉంటామని వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పాళ్ల రాఘవయ్య, నూతలపాటి బలరాం అన్నారు. బూత్ లెవెల్ అధికారులు నిబంధనల ప్రకారం పనిచేయాలని జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి గద్దం మస్తాన్ వలి సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్లా శ్రీనివాసరావు, షేక్ కాలేషా, దండా చౌదరి, పేరం సుబ్బారావు, ఎర్రాకుల తిరుమలేశ్వరరావు, జంగా అనిల్, ఆకుల హేమంత్, గాదె సురేష్, పాలేరు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపులపై విచారణ చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

బల్లికురవ: గ్రామాల వారీగా ఓటర్ల తొలగింపుపై విచారణ చేపట్టాలని తహశీల్దార్ కె. రవిబాబు కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం మండలంలోని 56 పోలింగ్ స్టేషన్లలోని బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఫారం–6తో ఓటు హక్కు కల్పించాలన్నారు. చనిపోయిన వారిని గ్రామాల్లో లేని వారిని తొలగించాలన్నారు. ఒకే ఇంటి నంబర్‌పై 10 నుంచి 15 ఓట్లు ఉంటే ఎక్కడ ఉంటున్నారో.. వారందరిని విచారణ చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితాలకు సంబంధించి ప్రక్రియను లోపాలు తలెత్తకుండా పారదర్శకంగా పూర్తిచేయాలని తహశీల్దార్ ఆదేశించారు.

వరినారు కొసలు తుంచితే ఉపయోగం


రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకి: వరి నాట్లు వేసే సమయంలో వరి నారు కొసలు తుంచి నాట్లు వేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. ఆయన గురువారం మండలంలోని కలవకూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వరినారు కొసల్లో ఉండే పురుగు గుడ్లను నివారించినట్లు అవుతుందన్నారు. తద్వారా ఆయా పురుగుల వల్ల కలిగే తెగుళ్లను, ఇతర నష్టాలను నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ మస్తాన్‌రావు, ఏఈవో కోటేశ్వరరావు, జినుగు జయరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తోటవారిపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీ ఇమ్రాన్‌ఖాన్ గ్రామస్తులకు సూచించారు. గురువారం మండలంలోని కావూరివారిపాలెం గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను పొక్లెయిన్‌తో తొలగించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, వలంటీర్లు పాల్గొన్నారు.